సాక్షి
విశాఖపట్నం

శనివారం | 27 | మే | 2023



డిజిటల్ జనాభా సూచిక

ఏయూలో డిజిటల్ పాపులేషన్ క్లాక్ సేవలను ఎస్.ఆర్.మీనా, వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించారు. 10లో



సంక్షేమ వారధులు వలంటీర్లు

సంక్షేమ సారథులు వలంటీర్లని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 10లో



పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

జిల్లాలో వివిధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు. 10లో

న్యూస్‌రీల్

హార్బర్ ప్రగతిపై ఆరా



నాలుగు లేన్ల రోడ్డు ప్లాన్‌ను పరిశీలిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునీకీకరణ ప్రాజెక్టు పనులను విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు శుక్రవారం పరిశీలించారు. హార్బర్‌ను సందర్శించి పనుల ప్రగతిపై ఆరా తీశారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును నిర్ణీత సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విశాఖ కంటైనర్ టెర్మినల్ వద్ద ఫేజ్–2లో భాగంగా నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ పనులను కూడా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి విఘాతం

పరవాడ (పెందుర్తి) : అనకాపల్లి జిల్లా పరవాడ దరి సింహాద్రి ఎన్టీపీసీలో వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్న 3, 4 యూనిట్లను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. విద్యుత్‌కు పెద్దగా డిమాండ్ లేని కారణంగా (అండర్ రిజర్వ్ షట్‌డౌన్) పై రెండు యూనిట్ల నుంచి ఉదయం 11 గంటలకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. అవసరాన్ని బట్టి మళ్లీ పై రెండు యూనిట్ల నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని, ప్రస్తుతం 1, 2 యూనిట్ల ద్వారా వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని సంస్థ అధికారులు తెలిపారు.

30 నుంచి పోర్టు వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణోత్సవాలు

డాబాగార్డెన్స్: పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 30 నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్ సుజాత, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల బ్రోచర్‌ను శుక్రవారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథరావు పాల్గొన్నారు.

29 నుంచి 7గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 2వతేదీ వరకు రాత్రి 7గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఏఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయంలో జరిగే నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఈ మార్పు చేసినట్టు తెలిపారు. అలాగే జూన్ 3న శ్రీనృసింహ జయంతిని ఆలయంలో వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటల తర్వాత స్వామికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా ఆరోజు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7గంటల వరకు దర్శనాలు లభించవని, ఆ తరువాత దర్శనాలు లభిస్తాయని తెలిపారు. భక్తులంతా ఈవిషయాలను గమనించాలని కోరారు.

30న యూపీఎస్సీపై అవగాహన సదస్సు

డాబాగార్డెన్స్: యూపీఎస్సీ, సివిల్ సర్వీస్ పరీక్షలపై అవగాహనను యువత సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు పోస్టర్ అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి బి.గంగారావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యువత సివిల్స్‌పై అపోహలు వీడి ముందుకు సాగాలన్నారు. యువతకు మేలు చేసే కార్యక్రమాలకు తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న యూపీఎస్సీ సెమినార్‌లో విద్యార్థులు పాల్గొవాలన్నారు. సదస్సులో పాల్గొనే వారు పేర్లు నమోదుకు 9315014015కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

అప్పన్న సన్నిధిలో ఏపీపీసీబీ మెంబర్ సెక్రటరీ శ్రీధర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం ఏపీపీసీబీ మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్ (ఐఏఎస్) దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఏఈవో శ్రీనివాసరావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

విదేశాల్లోనూ చదువులు ఫ్రీ

- పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన
- టాప్ 50 యూనివర్సిటీల్లో చదువుకునే అవకాశం
- రూ. కోటి 25 లక్షల వరకు ఫీజు చెల్లింపు
- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 21 కోర్సులకు అవకాశం



విశాఖ విద్య: పేద విద్యార్థుల చదువులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రాథమిక, సెకండరీ స్థాయిలో అమ్మ ఒడి, ఆపై చదువులకు జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలతో అండగా ఉంటోంది. ఇదే క్రమంలో విదేశాల్లో సైతం చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకంలో భాగంగా విదేశాలకు వెళ్లి చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ. కోటి వరకు మంజూరు చేయనుంది. అర్హులైన విద్యార్థులకే పథకం అందించేలా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, దరఖాస్తుల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకానికి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణ మూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పేద విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

టీడీపీ హయాంలో నిధుల దుర్వినియోగం

టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది విదేశాల్లో చదువులు పేరిట నిధులు దోపిడీ చేశారు. విదేశాలకు వెళ్లినప్పటికీ, అక్కడ వేరు వేరు పనులు చక్కబెట్టుకోవటం, మరికొంతమంది అయితే విదేశాలకు వెళ్లకుండానే తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పథకం పక్కదారి పట్టించారు. దీని వల్ల విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే అర్హులైన వారికి పథకం అందని పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని ప్రక్షాళన చేసింది. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికే పథకం వర్తింపజేసేలా విధి విధానాలు రూపొందించింది.

టాప్ 50లోనే చదువులు:–

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 379 యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్లలో లేటెస్ట్ క్యూఎస్ రేటింగ్ ఆధారంగా టాప్ 50 లో నిలిచిన యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్లలో చదువుకునే అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పీజీ లేదా పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక పరమైన సపోర్ట్ ఇవ్వనుంది. ఆయా కోర్సులకు అవసరమైన విద్యార్హతల్లో కచ్చితంగా 60 శాతం మార్కులు పొందిన వారినే పరిగణలోకి తీసుకుంటారు. ఎంబీబీఎస్ కోర్సు అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా ఆలిండియా స్థాయిలో నిర్వహించే నీట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. http://jnanabhumi. ap. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఈ కోర్సులకే అనుమతి..

అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్ అండ్ మైనింగ్, ఇంజినీరింగ్– పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లీజర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, నేచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఎస్ట్రానమీ

జూన్ 10 వరకు గడువు



అర్హత గల విద్యార్థులకు దరఖాస్తుకు జూన్ 10 వరకు గడువు ఉంది. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షలు మించకుండా 35 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – డి.వి. రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, విశాఖ జిల్లా

సెల్లార్ పార్కింగ్ తప్పనిసరి

- రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీటీసీ రాజరత్నం, ఎబిలిటీ పీపుల్ సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో

మహారాణిపేట(విశాఖ దక్షిణ): రద్దీ ప్రాంతాల్లోని కమర్షియల్ కాంప్లెక్సుల్లో సెల్లార్ పార్కింగ్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున స్పష్టం చేశారు. లేకపోతే ఆయా షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెల్లార్ పార్కింగ్ వల్ల రోడ్లపై కార్లు, బైకులు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవచ్చునన్నారు. పలు రద్దీ కూడళ్లలో రోడ్ల వెడల్పు పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత ప్రభుత్వ శాఖలు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, సూచనలపై యాక్షన్ టోకెన్ రిపోర్టు(ఏటీఆర్)పై చర్చించారు. పూర్తి చేసిన పనులపై నివేదిక తయారు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో గుర్తించిన పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు పనులు రెండు నెలల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో గ్రిల్ రెయిలింగ్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. గోశాల వద్ద రోడ్డు మరమ్మతుల కోసం చర్యలు చేపట్టాలన్నారు. మారికవలస నుంచి తగరపువలస ప్రధాన రహదారిలో లైటింగ్ ఏర్పాటు రెండున్నర నెలల కాలంలో పూర్తి చేయాలన్నారు. జాతీయ, జిల్లా రహదారులను తనిఖీ చేసి ఆక్రమణలను తొలగించాలని సూచించారు. షీలానగర్ నుంచి సబ్బవరం వరకు తలపెట్టిన రోడ్డు విస్తరణ పనులు ఆగస్టు నెలలోపు పూర్తి చేయాలన్నారు. సీతకొండ రోడ్డు వెడల్పు పనులు వీవీఎస్ జంక్షన్ వరకు ఆర్ అండ్ బీ శాఖ చేపట్టగా, మిగిలిన పనులు వీఎంఆర్‌డీఏ చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు. రహదారి భద్రతా కమిటీ సమావేశంలో గుర్తించిన రూ.28 కోట్ల పనుల్లో మొత్తం రూ.21 కోట్లు ఖర్చు చేశామన్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసి, వాహనాల వేగానికి కళ్లెం వేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ మీదుగా ద్విచక్ర వాహనాల రాకపోకలు నిషేధం విధించాలని పోలీసు అధికారులకు సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలన్నారు.

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ గాజువాక నుంచి అనకాపల్లి రోడ్డులో గ్రిల్స్ పెయింటింగ్ పనులు చేపడతామన్నారు. నగరంలో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేసి ప్రమాదాల నివారణకు కృషి చేస్తామన్నారు. డీటీసీ రాజరత్నం గత సమావేశం నుంచి ఇప్పటి వరకు చేసిన పనులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఎబిలిటీ పీపుల్ సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో, ఏసీపీ రాజీవ్, జీవీఎంసీ ఎస్ఈ సత్యనారాయణ, ఆర్ అండ్ బీ ఎస్ఈ జాన్ సుధాకర్, పంచాయతీరాజ్, ఏపీఈపీడీసీఎల్, వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ రహదారి, పోలీస్, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం



డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శనరెడ్డికి స్వాగతం పలుకుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

విశాఖ లీగల్: విశాఖలో శనివారం జరగనున్న మూడు జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశానికి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శనరెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన కడప నుంచి నగరానికి చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్టులో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జగదీశ్వర్ రావు, 11వ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి, పోక్సో కోర్టు పీపీ కరణం కృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ ఘనంగా స్వాగతం పలికారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తోపాటు, హైకోర్టు పీపీ వై.నాగిరెడ్డి, అదనపు పీపీ ఎస్.దుష్యంత్‌రెడ్డి కూడా నగరానికి చేరుకున్నారు. వీరు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తీరు, వివిధ కేసుల విచారణ, పెండింగ్ కేసులు, పీపీల సమస్యలపై చర్చిస్తారు. అనంతరం శనివారం సాయంత్రం తిరిగి ప్రయాణమవుతారు. తొలిసారిగా న్యాయవాద వృత్తి నుంచి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమితులైన సుదర్శనరెడ్డికి పలువురు సీనియర్ న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంప్లాయిమెంటు అధికారులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ (టెక్నికల్), సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్)లు తెలిపారు. హిరో మోటోకార్స్, భారత్ ఎఫ్ఐహెచ్ లిమిటెడ్, మోహస్ స్పింటెక్స్, టీమ్ లీజ్ (ఎస్‌బీఐ కార్డ్స్) బజాజ్ అల్కెమ్, టీజెఎల్ ఎస్‌డీటీ టెక్నాలజీస్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 390 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 123 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ, సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై పోటీ చేసి
గెలిచేది మత్స్యకారుడే



స్టోరేజ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- మత్స్యకారులను అవహేళన చేసినందుకు గుణపాఠం
- టీడీపీకి సమాధి కట్టడం ఖాయం
- రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు
- రూ.1.50 కోట్లతో మినీ ఆంధ్ర ఫిష్ సెంటర్ ప్రారంభం

కొమ్మాది (భీమిలి): మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు మత్స్యకారులను తోలు తీస్తానంటూ అవహేళన చేశాడని, రానున్న ఎన్నికల్లో కుప్పం నుంచి చంద్రబాబుపై మత్స్యకారుడే పోటీ చేసి గెలుస్తారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. భీమిలి బీచ్ రోడ్డు నాల్గవ వార్డు చేపల తిమ్మాపురంలో ది విశాఖపట్నం ఫిషర్ ఉమెన్ డ్రై ఫిష్ కోఆపరేటివ్ సొసైటీ సౌజన్యంలో కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించిన మినీ ఆంధ్ర ఫిష్ సెంటర్, ఫ్లాట్‌ఫామ్ స్టోరేజ్ రూమ్స్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల గడుస్తున్నా..మత్స్యకారుల జీవన విధానం మారలేదని రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణం చేసిన దగ్గర నుంచి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులతో పాటు గుర్తింపు వచ్చిందన్నారు. మత్స్యకారుడ్ని మంత్రిగా చేసిన ఘనత జగనన్నదే అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను రూ. 150 కోట్లతో ఆధునికీకరణ చేస్తున్నామని, పూడిమడకలో రూ. 360 కోట్లతో నూతన హార్బర్‌ను రానున్న రోజుల్లో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. రాజయ్యపేటలో జెట్టీని, భీమిలిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో కాకినాడ ఉప్పాడలో హార్బర్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వేట విరామ సమయంలో రూ.10వేల మత్స్యకారులకు అందిస్తున్నామని చెప్పారు. అదే విధంగా మత్స్యకారుల స్థాయిని పెంచే విధంగా ఎక్కడికక్కడ ఫిషర్ ఆంధ్ర సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో 70 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు పడవలు అందించబోతున్నామన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఫిష్ డ్రైయింగ్ మెషన్లను మత్స్యకారులకు అందుబాటులోనికి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ ఉన్న చంద్రబాబు ఏనాడైనా మత్స్యకారులకు మేలు చేసే కార్యక్రమం చేశారా అని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. మత్స్యకారుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని, ఆయన హయాంలో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులు చంద్రబాబుకు తోలు తీసి, బుద్ధిచెప్పి ఇంటికి పంపిస్తారని తెలిపారు.

చంద్రబాబుకు ప్రజలే సమాధి కడతారు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు అవహేళన చేసి సమాధులకు కూడా పనికిరావని విమర్శించాడని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి పేదలే సమాధి కడతారని అప్పలరాజు పేర్కొన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తున్నా టీడీపీ అడ్డుకుంటోందన్నారు. రానున్న కాలంలో విశాఖ రాజధానిగా మారడం ఖాయమని, విశాఖ నుంచి భోగాపురం వరకు ఆరు లైన్ల రోడ్డు నిర్మించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గతంలో తిమ్మాపురంలో మత్స్యకారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కోర్టు కేసుల నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని ఇక్కడ మత్స్యకారులు మంత్రి సీదిరి అప్పలరాజును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, జేసీ విశ్వనాథన్, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, సొసైటీ అధ్యక్షులు మారుపల్లి పార్వతమ్మ, స్థానిక నాయకులు మారుపల్లి అమర్‌నాథ్, వాసుపల్లి నల్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినతుల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం

- జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు. చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ

మహారాణిపేట : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు సూచించారు. కలెక్టర్ డా.ఎ.మల్లికార్జునతో కలిసి శుక్రవారం జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు సంబంధించి ప్రభుత్వ సూచనలను ప్రతి జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారి తూ.చ తప్పకుండా పాటించాలన్నారు. ఒకసారి వచ్చిన పిటిషన్ తిరిగి ఎందుకు వస్తుందో సంబంధిత అధికారులను ప్రశ్నించాలన్నారు. అవసరమైతే ఆ ప్రాంత మండల అధికారి, సిబ్బంది అర్జీదారు ఇంటికి వెళ్లి వారితో చర్చించి సమస్య పరిష్కరించేలా ప్రక్రియ జరగాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని సంతృప్తికర స్థాయిలో పరిష్కరిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లాలో జీవీఎంసీ పరిధి ఎక్కువని, సమస్యలు కూడా జీవీఎంసీ పరిధిలో ఎక్కువ ఉంటాయి కాబట్టి సంబంధిత అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలన్నారు. జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలు, నిర్వహణ, విజ్ఞప్తుల పరిష్కారం, జిల్లా స్థాయి ఆడిట్ టీం మొదలైన విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ మల్లికార్జున వివరించారు. జిల్లా స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో అధికారుల బృందం పని చేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఆర్‌వో ఎస్.శ్రీనివాస మూర్తి, పలువురు జిల్లా అధికారులు, జీవీఎంసీ అధికారులు హాజరయ్యారు.

మారుమూలలకు వెళ్లం..!

- నగరాన్ని వదలని అయ్యవార్లు
- పదోన్నతులకు ఆసక్తి చూపని ఉపాధ్యాయులు
- 300 మందిని పిలిస్తే, 151 మంది విల్లింగ్
- నేడు గ్రేడ్–2 హెచ్ఎంలకు అంగీకార పత్రాలు సేకరణ



డీఈవో కార్యాలయం

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు మేలు చేయాలనే తలంపుతో ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, కొంతమంది అయ్యవార్లు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది.ఉద్యోగోన్నతులకు అర్హులైన వారి నుంచి డీఈవో కార్యాలయ అధికారులు అంగీకార పత్రాలను సేకరిస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు)కు ఉద్యోగోన్నతి కల్పించేందుకు అర్హులైన వారి నుంచి డీఈవో కార్యాలయంలో శుక్రవారం అంగీకర పత్రాలను తీసుకున్నారు. సీనియార్టీ మేరకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 300 మంది ఉపాధ్యాయులను పిలిచారు. వీరిలో 181 మంది మాత్రమే ధ్రువీకరణ పత్రాల పరిశీలకు హాజరు కాగా, వీరిలో 151 మంది ఉపాధ్యాయులు మాత్ర మే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి తీసుకునేందుకు అంగీకార పత్రాలు ఇచ్చారు. ప్రమోషన్ ఇస్తామన్నా, మాకొద్దంటూ ఉపాధ్యాయులు నిరాసక్తత వ్యక్త చేయడం గమనార్హం.

మారుమూలలకు వెళ్లడం ఇష్టం లేకనే..

ఉద్యోగులకు ప్రమోషన్ అంటే అదో సంబరమే. పని చేస్తున్న కేడర్ నుంచి మరో కేడర్ పోస్టుకు వెళ్లటంతో పాటు, రెండు ఇంక్రిమెంట్లు మంజూరవుతాయి. దీని వల్ల నెలసరి వేతనంలో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఎంతలేదన్నా, ఒక్కో ఉపాధ్యాయుడికి నెలకు రూ.5 వేలు వరకు వేతనం పెరుగుతుంది. అయితే కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం, ప్రమోషన్ తీసుకునేందుకు నిరాసక్తత వ్యక్తచేయడం ఇప్పు డు హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఎక్కువగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లోనే ఉద్యోగోన్నతి కేడర్‌లో ఖాళీలు ఉన్నట్లు డీఈవో కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి విశాఖ నగరం, దీని చుట్టపక్కల పాఠశాలల్లో తిష్టవేసిన ఉపాధ్యాయులు, ఇక్కడి నుంచి కదిలేందుకు ఇష్టం లేక, ఉద్యోగోన్నతులు సైతం వదులుకుంటున్నారనే ప్రచారం ఉంది.

నేడు స్కూల్ అసిస్టెంట్ల పిలుపు

గ్రేడ్–2 హెచ్ఎం పోస్టులు 13 ఖాళీ ఉన్నాయి. వీటిని అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉద్యోగోన్నతి తీసుకునేందుకు ఇప్పటికే 10 మంది అంగీకార పత్రాలు ఇచ్చారు. కాగా మరో నలుగురు స్కూల్ అసిస్టెంట్‌లను ధ్రువీకరణ పత్రాల పరిశీలన, అంగీకార పత్రాల సేకరణ కోసమని శనివారం డీఈవో కార్యాలయానికి హాజరుకావాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాను విడుదల చేశారు.

అంగీకారపత్రాలు సేకరిస్తున్నాం



ఉద్యోగోన్నతుల కోసమని అర్హులైన ఉపాధ్యాయుల నుంచి అంగీకార పత్రాలను సేకరిస్తున్నాం. సీనియార్టీ జాబితాలో ఉన్నప్పటికీ, కొంతమంది ఉపాధ్యాయు లు ప్రమోషన్ నిరాకరిస్తున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – లక్ష్మణరావు, ఇంచార్జి డీఈవో, విశాఖ జిల్లా

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

మహారాణిపేట: జిల్లాలో వివిధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు. శుక్రవారం ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో పెండింగ్ కేసులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2015–20, 2020–23 కింద 57 క్లెయిములకు రూ.4.21 కోట్లు మంజూరు చేశామన్నారు. పీఎంఈజీపీ పథకం కింద పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి బ్యాంకర్లు రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ పనులను సత్వరం ప్రారంభించాలని, ఆటోనగర్ లోని పరిశ్రమలకు మంచి నీటి పనులను వారంలోగా పూర్తి చేయాలన్నారు. మధురవాడ ఐటీ పార్కుకు ఐలా స్టేటస్ మంజూరైందన్నారు. అగనంపూడి ఇండస్ట్రియల్ పార్కుకు అదనంగా 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థాపించామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సిహెచ్.గణపతి, ఐలా కమిషనర్ సూర్యనారాయణ, ఏపీఐఐసీ డిప్యూటీ జెడ్‌ఎం టి.జయబాబు, ఏపీ ట్రాన్స్‌కో, జీవీఎంసీ, వ్యవసాయ, మత్స్య శాఖ, అగ్నిమాపక, టౌన్‌ప్లానింగ్, పాల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై అలసత్వం తగదు

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



షిప్‌యార్డ్ యాజమాన్యంతో చర్చిస్తున్న విక్టర్ ప్రసాద్, ఇతర ఉద్యోగులు

సింథియా : షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సమస్యల పరిష్కారంపై అలసత్వం తగదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూస్తాన్ షిప్‌యార్డ్‌కు వచ్చిన ఆయన షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద విలేకర్లతో మాట్లాడారు. అనంతరం షిప్‌యార్డ్ సమావేశ మందిరంలో షిప్‌యార్డ్ యాజమాన్యంతోనూ, ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లతోనూ, పలువురు కార్మిక, సామాజిక సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రితో పలు కార్మిక సమస్యలపై వివరణ కోరారు. షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న దళిత ఉద్యోగిపై సంస్థ డైరెక్టర్ కార్పొరేట్ ప్లానింగ్ అధికారి అనుచిత ప్రవర్తనపై ప్రశ్నించారు. అందుకు తగిన సమాధానం రాకపోవడంతో సంబంధిత అధికారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అక్కడే ఉన్న హార్బర్ ఏసీపీ మోసెస్‌పాల్‌ను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పరిశ్రమ ఆవరణలో ఉంటే యాజమాన్యానికి ఏంటీ అభ్యంతరమని ప్రశ్నించారు. ఎల్ సిరీస్ కార్మికుల్లో మిగిలిన 16 మందిలో ఎస్సీ, ఎస్టీకి చెందిన నలుగురు కార్మికులను కంపెనీ రోల్‌లోకి తీసుకోవాలని, వర్క్ టు స్టాఫ్, స్టాఫ్ టు ఆఫీసర్, ఆఫీసర్ టు ప్రమోషన్ పాలసీని అమలు చేయాలని కోరారు. సిరీస్‌లో ఉన్న 300 మంది ఎస్సీ, ఎస్టీ కేటగిరి కార్మికులకు పర్మినెంట్ చేయాలని కోరారు. దీనికి సమాధానంగా సీఎండీ మాట్లాడుతూ పర్మినెంట్ చేయడం అనేది కేంద్రప్రభుత్వ పరిధిలోనిదని, తమ పరిధిలో ఉండదన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గత సీఎండీ శరత్‌బాబు సూచించిన డాల్ఫిన్ జెట్టి ప్రాంతాన్ని సందర్శించి అసహనం వ్యక్తం చేశారు.

సాయంత్రం షిప్‌యార్డ్ కాలనీలోని బాలకృష్ణ కళ్యాణమండపంలో ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులతో సమావేశమై జాతి అభివృద్ధికి కృషి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు అప్పలకొండ, కార్యదర్శి అనిల్ కుమార్, పలు కార్మిక సంఘాల ప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్



కాంక్రీట్ మిక్సర్‌తో గోతులు పూడ్చుతున్న హార్బర్ ట్రాఫిక్ కానిస్టేబుల్

అల్లిపురం: చిత్తశుద్ధి, అంకిత భావంతో హార్బర్ ట్రాఫిక్ విభాగానికి చెందిన ఓ కానిస్టేబుల్ విధులు నిర్వర్తించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పోర్టు రోడ్డులో శుక్రవారం ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు బ్రిడ్జిల మధ్యలో రోడ్డుపై పెద్దగా గోతులుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీని ఆ కానిస్టేబుల్ ఆపారు. డ్రైవర్‌తో మాట్లాడి కొద్దిగా కాంక్రీట్ మిక్సర్‌ను అక్కడున్న గోతిలో డంప్ చేయించారు. తర్వాత చిన్న కర్ర తీసుకుని కాంక్రీట్ మిక్సర్‌తో గోతిని పూడ్చారు. అటువైపు వెళ్తున్న వాహన చోదకులు ట్రాఫిక్ కానిస్టేబుల్ నిబద్ధతను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో శభాష్ పోలీస్ అంటూ పోస్ట్ చేసి ప్రశంసించారు.

ఏయూలో డిజిటల్ జనాభా సూచిక

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిజిటల్ పాపులేషన్ క్లాక్ సేవలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్, భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ క్లాక్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాయి. 10 సెకండ్లకు ఒకసారి తాజాగా దేశ, రాష్ట్ర జనాభాను ఈ డిజిటల్ పాపులేషన్ క్లాక్‌పై అప్‌డేట్ అవుతుంది. వర్సిటీ జనాభా పరిశోధన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఈ క్లాక్‌ను భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్(స్టాటస్టిక్స్) ఎస్.ఆర్.మీనా, వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులతో పాటు సామాన్యులకు దేశ జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించేందుకు ఈ డిజిటల్ క్లాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో ఏయూ జనాభా అధ్యయన కేంద్రాన్ని మరిన్ని ప్రాజెక్టులతో అనుసంధానించడంతో పాటు కేంద్రంలో ఉద్యోగుల సంఖ్య పెంచుతామన్నారు. వీసీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 1977 నుంచి ఏయూలో జనాభా అధ్యయన కేంద్రం విలువైన సేవలు అందిస్తుందని తెలిపారు. అనంతరం ఆధునీకరించిన పీఆర్‌సీ డైరెక్టర్ చాంబర్‌ను ప్రారంభించారు. అలాగే విభాగ ప్రాంగణంలో ఆర్‌వో ప్లాంట్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించగా, రెక్టార్ ఆచార్య కె.సమత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ఆచార్య నరసింహారావు, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.కె.భట్టి, ఆచార్య వి.విజయలక్ష్మి, పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ గౌరవ సంచాలకుడు ఆచార్య బి.మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : ప్రతి నెలా ఒకటో తేదీన తెలవారకముందే వృద్ధులకు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందించే వలంటీర్ల సేవాతత్పరతకు వెలకట్టలేమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలు ఆవరణలో శుక్రవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ మానస పుత్రికగా కొనియాడే సచివాలయ వ్యవస్థకు వలంటీర్లు మూలస్తంభాలన్నారు. ఏటా వలంటీర్ల సేవల్ని గుర్తించి, వారిని సత్కరించుకోవడం మంచి సంప్రదాయంగా అభివర్ణించారు. కేవలం 50 కుటుంబాల సేవకు ప్రభుత్వం తరఫున ఒక వలంటీర్‌ను నియమించిన ఒకే ఒక సీఎం మన జగనన్న అని కొనియాడారు. ఇంతకు మించిన ఆదర్శ పాలన ఏముంటుందని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు సీఎం జగన్ పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. మధురవాడ జోన్–2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డులకు చెందిన 727 మంది వలంటీర్లకు సేవామిత్ర, నలుగురికి సేవారత్న అవార్డులను ప్రదానం చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్సీ కనకమహాలక్ష్మి 6, 7వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులు కె.వరలక్ష్మి, సీరజ, పార్టీ నాయకులు జె.ఎస్.రెడ్డి, వి.రవి, కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, యర్రాజీ, పోతిన ప్రసాద్, జామి శివకుమార్, అప్పారావు, పోతిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 30న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: విశాఖ సెంట్రల్ జైలులో పాడేరుకు చెందిన రిమాండ్ ఖైదీ కొర్ర వెంకటరమణ మృతిపై ఈనెల 30న మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నట్టు విశాఖ ఆర్డీవో హుస్సేన్ తెలిపారు. గత ఏప్రిల్ 16న అనారోగ్యానికి గురైన వెంకటరమణను కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడని ఆయన పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. వెంకటరమణకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిసి ఉంటే మెజిస్టీరియల్ విచారణలో తెలియజేయాలని ఆయన కోరారు.

ఒకే వ్యక్తికి రెండు అవయవాల మార్పిడి



అవయవాల మార్పిడి జరిగిన సత్యనారాయణతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు

అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : ఒకే వ్యక్తికి గంటల వ్యవధిలో రెండుసార్లు అవయవ మార్పిడి చేయడంలో కిమ్స్ ఐకాన్ వైద్యులు ఘనత సాధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆర్.కె.మహేష్‌లు శుక్రవారం వెల్లడించారు. అమలాపురానికి చెందిన వ్యాపారి వై.వెంకట సత్యనారాయణ (50)కు హెపటైటిస్ సీ కారణంగా కాలేయ క్యాన్సర్, లివర్ సిరోసిస్ రెండు వ్యాధులతో పాటు దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి (సీకేడీ)తో ఇబ్బంది పడుతూ దాదాపు మృత్యువుకు చేరువవుతున్న సమయంలో షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లో చేరారు. లివర్ క్యాన్సర్, లివర్ సిరోసిస్ కారణంగా రోగి కాలేయం బాగా పాడైపోయింది. దీనికి తోడు అతని మూత్రపిండాలు పూర్తిగా పాడవ్వడంతో సాధారణ చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. దీంతో అతనికి రెండు అవయవాలు మార్పిడి అనివార్యమైందని భావించాం. ఒకే వ్యక్తికి రెండు అవయవాలు సేవరించడం కష్టంగా మారింది. రోగి ప్రాణాలు ప్రమాదంలో పడటంతో అత్యవసరంగా దాతల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఇటీవల శ్రీకాకుళంలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి ఒక మూత్రపిండం, జీవన్‌ధాన్ నుంచి కాలేయాన్ని పొందినట్లు తెలిపారు. సరైన సమయంలో రెండు అవయవాలు లభ్యమవడంతో పాటు తక్కువ సమయంలో రోగికి ఇవి అమర్చడంతో అతని ప్రాణాలు కాపాడగలిగామన్నారు. ఏప్రిల్ 22న జరిగిన శస్త్రచికిత్స జరిగిన తర్వాత రోగిని 15 రోజుల పాటు ఆస్పత్రిలో పర్యవేక్షణలో ఉంచిన తర్వాత పూర్తి ఆరోగ్యంతో ఉండటంతో డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. కాలేయ మార్పిడి చేసిన నిపుణుల్లో డాక్టర్ రవిచంద్ సిద్ధాచారి, డాక్టర్ సచిన్ డాగా, డాక్టర్ మురళీధర్ సంబాడ, డాక్టర్ రవిచంద్రా రెడ్డి, మూత్రపిండాల మార్పిడి బృందంలో డాక్టర్ మహేశ్వరరావు, డాక్టర్ మురళీకృష్ణ పద్యాల, క్రిటికల్ కేర్ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. ఇప్పటి వరకు కిమ్స్ ఐకాన్‌లో 16 కాలేయ మార్పిడిలు, 120 మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా జరిగాయని అన్నారు. వైద్య బృందానికి రోగి వెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు చిక్కిన హత్య కేసు నిందితుడు



కొండవీటి శివ

మర్రిపాలెం(విశాఖ ఉత్తర): హత్య చేసి రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడు ఎట్టకేలకు కంచరపాలెం పోలీసులకు చిక్కాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టాభిరెడ్డితోట ప్రాంతానికి చెందిన కొండవీటి శివ అలియాస్ సాంబశివరావు లస్సీ షాపు నిర్వహించేవాడు. మద్యంతో పాటు విలాసాలకు అలవాటు పడిన శివకు షాపులో వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఇలా 2009 నుంచి 2018 వరకు ఈయనపై 21 దొంగతనాల కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 11, 2021న ఊర్వశి జంక్షన్ వద్ద పైడి రమేష్ అలియాస్ ఉల్లిపాయల సత్తి(35), శివ మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నారు. శివ ఒక్కసారిగా పక్కనే ఉన్న కర్రతో సత్తిపై దాడిచేసి బలంగా కొట్టి గాయపరిచాడు. సత్తికి తీవ్ర గాయాలు కావడంతో మరణించి ఉంటాడని భయపడి ఘటనా స్థలం నుంచి శివ పారిపోయాడు. అయితే సత్తి రెండు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత ఆగస్టు 13న మృతిచెందాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న శివ విజయవాడ, గుంటూరు, తదితర జిల్లాల్లో తిరుగుతూ ఇంతవరకు తప్పించుకున్నాడు. పోలీసులు నిందితుడిపై నిఘా పెట్టి గాలించినా ఫలితం లేకుండాపోయింది. శివ భార్య ఫోన్‌ను కాల్ ట్రేసింగ్(సీడీఆర్) కూడా పెట్టారు. మధ్యలో భార్య, పిల్లలతో మాట్లాడేవాడు. మళ్లీ రెండు, మూడు రోజులకు సిమ్‌కార్డు మార్చి తప్పించుకునేవాడు. ఈ క్రమంలో గురువారం భార్యకు శివ కొత్త నంబర్‌తో ఫోన్ చేసి విశాఖకు వస్తున్నట్టు తెలిపాడు. ఈ కాల్ డేటాతో సమాచారం అందుకున్న కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్, ఎస్ఐ షేక్ సమీర్, కానిస్టేబుల్ రామరాజు శుక్రవారం ఉదయం మాటువేశారు. విశాఖ రైల్వే స్టేషన్ నుంచి నిందితుడు ఇంటికి వెళ్తుండగా పోలీసులు ఆర్‌పీ పెట్ట వద్ద అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు.

మహానాడుకు తరలిరండి

మహారాణిపేట : ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో పలు తీర్మానాలు ఆమోదించనున్నామని టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమండ్రిలో జరిగే మహానాడుకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎవరికి సొత్తు కాదని, తెలుగు వారి ఆత్మాభిమానమని చెప్పారు.

వరకట్న వేధింపుల కేసులో వ్యక్తికి జైలు శిక్ష

ఉక్కునగరం: భార్యను అదనపు కట్నం తెమ్మని వేధిస్తున్న ఓ వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉక్కునగరం సెక్టార్–3లో నివసిస్తున్న పసల చక్రధరరావు వరకట్నం కోసం తన భార్య సంతోషికుమారిని వేధిస్తున్నట్టు 2014లో స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో చక్రధరరావుకు రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ గాజువాక 8వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి తీర్పు ఇచ్చారు.

బదిలీలకు దరఖాస్తుల వెల్లువ

విశాఖ విద్య: విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తులు వెల్లువలా వస్తాన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే శుక్రవారం సాయంత్రానికే 6 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు డీఈవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. జీరో సర్వీసుతో బదిలీకి అవకాశం కల్పించటంతో అధికారులు ఊహించిన దాని కంటే ఎక్కువగా దరఖాస్తులు వస్తాన్నాయి. ఇదిలా ఉంటే బదిలీ కోసమని వచ్చిన దరఖాస్తుల వాస్తవికతను నిర్ధారించేందుకు పరిశీలన ప్రక్రియ కూడా శరవేగంగా సాగుతోంది. 27 నాటికి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిని వేగవంతం చేశారు. ఎస్జీటీలకు ఎంఈవో స్థాయిలో, స్కూల్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ డీఈవో, హెచ్‌ఎంలకు ఆర్జేడీ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని ధ్రువీకరిస్తున్నారు. ఒకే చోట 8 ఏళ్లకు పైబడిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఐదేళ్లకు పైబడిన హెచ్‌ఎంలు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. దీంతో ఖాళీల జాబితాలను ప్రదర్శించేందుకు డీఈవో జి.లక్ష్మణరావు నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్

ఉపాధ్యాయులు బదిలీల్లో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సకాలంలో పరిష్కరించేలా డీఈవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్ ఫర్ జీవో గైడ్ లైన్స్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం జెడ్పీ హెచ్‌ఎస్ అనంతవరం, అగనంపూడి హెచ్‌ఎంలు కృష్ణకుమార్, కృష్ణారావును నియమించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తలెత్తే సాంకేతిక సమస్యల పరిష్కారంకు డీఈవో కార్యాలయ ఏఎస్‌వో జి. సుబ్రహ్మణ్యం, అరకు ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న జి. సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించారు. బదిలీలకు సంబంధించిన ఫిర్యాదులపై డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ కే. పల్లవికు బాధ్యతలు అప్పగించారు. బదిలీల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వీరు పనిచేస్తారు.

పడవ బోల్తా- మత్స్యకారుడి మృతి



మృతి చెందిన శీరం అప్పారావు

భీమునిపట్నం: భీమిలి తీరంలో శుక్రవారం పడవ బోల్తాపడిన ఘటనలో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఎగువపేటకు చెందిన శీరం అప్పారావు (77) తోటి మత్స్యకారులతో కలిసి శుక్రవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో సముద్రంపైకి చేపలవేటకు వెళ్లాడు. తిరిగి వీరందరూ ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో లైట్‌హౌస్ సమీపంలోని తీరానికి వస్తున్నారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో పడవ ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అప్పారావు అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోయాడు. ఆయతోపాటు ఉన్న గరికిన ఎల్లాజీ, పీరుపల్లి రాజు, జీ.ఎల్లాజీ, పీరుపల్లి నూకరాజు సురక్షితంగా తీరానికి చేరుకున్నారు.